# పారిజాతం కథ

బాలాజీ కళ్యాణ మండపం పట్టుచీరల రెప రెపలతో, విరిబోణుల కురులలోని విరజాజుల ఘుమఘుమలతో, అత్తరు పరిమళాలతో, అందాల పడతుల కులుకులతో, పడుచుపిల్లల హడావుడీ ఆర్భాటాలతో, కన్నెపిల్లల వొయ్యారాల వొంపు సొంపులతో కిటకిటలాడిపోతోంది. పెళ్ళికొడుకికీ, పెళ్ళి కూతురికీ మధ్య కట్టిన తెర జారిపోకుండా, అటూ ఇటూ అంచులు పట్టుకుని ఇద్దరు కుర్రాళ్ళు నుంచున్నారు ధీమాగా. వాళ్ళు ఏదో ముఖ్యమైన పని చేసేస్తున్నట్టు పోజు పెట్టి మధ్య మధ్య తెర కొంచెం ఒదులుగా జారవిడిచేసరికి పెళ్ళికొడుకు క్రీగంట పెళ్ళికూతుర్ని తనివితీరా చూస్తున్నాడు. పెళ్ళికూతురు చూసీ చూడనట్టు మునిముని నవ్వులు నవ్వుతోంది. అదేదో మహాపరాధమైనట్టు పురోహితుడు తెర పైకి లాగి "గట్టిగా పట్టుకోండి బాబూ!" అంటూ ఉరుము లాంటి కేక పెట్టాడు. కుర్రాళ్ళిద్దరూ ఉలిక్కిపడి వెంటనే తెర పైకిలాగి గట్టిగా పట్టుకున్నారు.

పార్థసారథి తన కళ్ళకి అడ్డంగావున్న నీటి పొరలని జేబురుమాలుతో తుడుచుకున్నాడు. దుఃఖం, సంతోషం రెండూ కలిసి గుండె బరువుగా అనిపించింది. పదిమందీ వున్నారన్న భావనే లేకపోతే పెద్దగా ఏడ్చేవాడేమో కాని, సభ్యత ముసుగులో కన్నీళ్ళని కక్కలేక, దిగమింగుకోవడానికి ప్రయత్నం చేశాడు. కానీ గుండెలో కాగి మరిగిపోతూ, లావాలా ఉబుసు కొస్తున్న ఆ కన్నీటి ప్రవాహాన్ని ఆపటానికి, అతనికి శక్తి చాలలేదు. జేబు రుమాలు నోటికడ్డంగా పెట్టుకుని, వెక్కిళ్ళ నాపుకుంటున్నాడు.

"ఏరా? ఏమిటిరా ఈ ఏడుపు? అక్కడికి నీ ఒక్కడికే చెల్లెలున్నట్టు! ప్రపంచంలో ఏ ఆడపిల్లయినా ఇంతేరా! ఏదో ఒకరోజు కన్నవాళ్ళని, వున్న

వాళ్ళనీ వదిలిపెట్టి, పుట్టి పెరిగిన వాకిలి విడిచి కట్టుకున్నవాడితో వెళ్ళిపోక తప్పదు. కన్న మమతా, పెంచిన మమతా తుంచుకుని పంపించెయ్యాల్సిందే! అందుకే ఆడపిల్లల పెళ్ళిలో అదోరకమైన బాధ." పార్థసారథి భుజంమీద చెయ్యేస్తూ అన్నాడు ప్రకాష్.

"పెళ్ళయిపోతోంది కదూ?" కళ్ళు తుడుచుకుంటూ అప్రయత్నంగా అన్నాడు పార్థసారథి.

"ఒరేయ్ పార్థూ, నీకు పిచ్చెక్కిందా? ఏమిటా ప్రశ్న?" పార్థు నిజంగా పిచ్చివాడిలాగా అనిపించాడు ఆ క్షణంలో ప్రకాష్‌కి.

"మాంగళ్యం తంతునానేనా. సహ జీవన హేతునా భజంత్రీలూ, వాయించండి." పురోహితుడి కేకకి, క్షణం ఆలస్యం కాకుండా ఆనంద మానంద మాయనే అంటూ బాజావాళ్ళు హుషారుగా వాయిస్తుంటే, సిక్‌బాండువాళ్ళు 'పందిట్లో పెళ్ళవుతున్నాది, కనువిందవుతున్నాదీ' మహా జోరుగా వాయించేస్తున్నారు. రెండూ కలిసి చెవులు చిల్లులు పడుతుంటే అక్షింతలు వర్షం కురిసినట్టు జలజలా రాలుతున్నాయి. తమ పనైయిపోయినట్టు, ఇంకా ఒక్క క్షణం కూడా వుండలేనట్టు, అప్పుడే జనం తోసుకుంటూ వెళ్ళిపోతున్నారు.

పార్థూ తలవంచుకుని కళ్ళు గట్టిగా తుడుచుకుని మంటపంకేసి చూశాడు. పారిజాతం సిగ్గులు దాచుకోవడానికేమోనన్నట్టు తలవంచుకుని కూర్చుంది. మనోహరన్ ఆమె మెడలో మూడు ముళ్ళు వేశాడు

పార్థూ సంతోషంతో "ప్రకాష్! మనోహరన్ పుస్తెకట్టేశాడురా, ఇంకేం పరవాలేదు.... మా పారిజాతం అదృష్టవంతురాలు" అంటూ ఏదో చెప్పబోతున్నాడు.

ప్రకాష్‌కి పార్థూ ప్రవర్తన చాలా వింతగా అనిపించింది. పార్థు ఎందుకిలా ఉద్రేకపడుతున్నాడు? అనే ప్రశ్న కూడా ఉద్భవించింది. "పార్థూ! నిన్ను చూస్తూవుంటే, నీలో యేదో ఆందోళన కనబడుతోందిరా, యేమిటో చెప్పు" అన్నాడు పార్థుని లాలిస్తున్నట్టుగా, అతని భుజాలు పట్టుకుని. "చెప్తా వుండు ముందు అక్షింతలు వేసొద్దాం రా!" అంటూ చెయ్యిపట్టుకుని లాక్కుపోయాడు మండపం దగ్గరికి పార్థూ.

ప్రకాష్, పార్థు చిన్నప్పటినుంచి క్లాస్‌మేట్స్, బెంచిమేట్స్. ఇద్దరూ అనుకోకుండా ఇంజనీర్లే అయ్యారు అయితే ఉద్యోగాలు వాళ్ళని విడదీసాయి. ప్రకాష్‌కి హెచ్.ఎ.ఎల్. బెంగుళూరులో ఉద్యోగం వస్తే, పార్థుకి బి.హెచ్.ఇ.ఎల్. హైదరాబాద్‌లో ఉద్యోగం వచ్చింది. దాంతో విధిలేక విడిపోయారు. కొత్తల్లో వారానికో ఉత్తరం చొప్పున రాసుకునేవారు. రానురాను నెలకో ఉత్తరం. ఇప్పుడు ఆర్నెల్లకో, ఏడాదికో ఉత్తరాలు రాసుకుంటున్నారు. అయినా ఆ ఉత్తరాల్లో యేడాదికి సరిపోయే విశేషాలు వుంటాయి. అయితే, ఈ మధ్యన ప్రకాష్ కంపెనీ తరపున జర్మనీలో ఒక సంవత్సరం ట్రైనింగ్‌కి వెళ్ళడం వలన పార్థు విశేషాలేమీ తెలీలేదు. తను ఇండియాకి తిరిగొచ్చిన వారానికే ఈ శుభలేఖ వొచ్చింది. పారిజాతం తననీ పార్థులాగే చూసేది. "ప్రకాష్ అన్నయ్యా, ప్రకాష్ అన్నయ్యా" అంటూ ఒక్క క్షణం ఒదిలిపెట్టేది కాదు. అందుకే ఆలసటగా వున్నా, పెళ్ళికి ప్రయాణమయ్యాడు ప్రకాష్. పార్థు ప్రవర్తన అంతా అయోమయంగా అనిపించింది ప్రకాష్‌కి.

అక్షింతలు వేసి ఆశీర్వదించొచ్చారు ప్రకాష్, పార్థులు. అంతలో భోజనాల హడావుడి! స్నేహితులిద్దరికీ,మాట్లాడుకోవటానికి టైము దొరకలేదు.

భోజనాలయ్యాక, అందరూ తలో చోటా గుంపులు గుంపులుగా కూర్చొని పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. భోంచేసి వెళ్ళిపోగా మిగిలిన వాళ్ళు ప్రకాష్, పార్థులూ కూడా ఒకచోట స్థలం చూసుకుని మూలగా కూర్చున్నారు, ఎదురుగుండా మరో రెండు కుర్చీలమీద కాళ్ళు చాపుకుని విశ్రాంతి తీసుకుంటూ.

"ఇప్పుడు చెప్పరా, నీ మనసులోని బాధేమిటో! యిందాకటినుంచీ తెగ యిదైపోతున్నావు భరించలేక పోతున్నాను" అన్నాడు ప్రకాష్ వక్కపొడి తీసి నోట్లో వేసుకుంటూ.

పార్థు మొహం సీరియస్‌గా మారిపోయింది. మెల్లగా చెప్పడం మొదలెట్టాడు:

"ఒరేయ్! నీకు పారూ తెలుసుగా - చిలిపితనం, చలాకీతనం, మంచితనం కలిపి రంగరించుకున్నట్టు ఎలా చురుకుగా వుండేది! పారులో పెద్ద అందం లేకపోయినా ఆకర్షణ ఉందికదూ!" ప్రకాష్ కళ్ళలోకి చూస్తూ అడిగాడు పార్థు.

ప్రకాష్‌కి పార్థుని చూస్తే ఒళ్ళు మండుకొచ్చింది.

"ఏరా, పారూని నాకు కొత్తగా పరిచయం చేస్తున్నావా, నేనెప్పుడూ చూడనట్టు! ఒరేయ్, పారిజాతం నాకూ చెల్లెలేరా! పారూని చూసి నేనెంత గర్వపడతానో తెలుసా?" అన్నాడు చిరుకోపం ప్రదర్శిస్తూ.

"ప్రకాష్! నేనెందుకు చెప్పడం? నాకు తెలుసు నీకు పారు స్వంత చెల్లెలులాంటిదని! ఎందుకు చెప్తున్నానంటే, ఏ విషయాలు చూసి మనం గర్వపడ్డామో అవే ఆమెకి శాపాలయ్యాయి."

''పార్థూ ఏమిటి నువ్వంటున్నది?'' కంగారుగా అడిగాడు ప్రకాష్.

''పారూకి గలగలా మాట్లాడడం, కిలకిలా నవ్వడం, ధైర్యంగా ఉన్నది ఉన్నట్టు అనడం ఇవన్నీ ఉగ్గుపాలతో వచ్చిన విద్యలు. కల్మషంలేని కపటం తెలియని అమాయకురాలు కూడా. పారూ కాలు బయటపెడితే చాలు కాలేజీకి వెళ్ళేటప్పుడూ వచ్చేటప్పుడూ కూడా, ఏ పనీపాటాలేని రోడ్డుసైడు రోమియోలు, వెంటపడి బాడీగార్డుల్లా వెంట వచ్చేవారట! సాధారణంగా పారు ఎప్పుడూ వంటరిగా వెళ్ళేదికాదు ఎక్కడికి. కాలేజీకి కూడా దాని ఫ్రెండ్సొక రిద్దరు మన యింటికేవచ్చి అందరు కలిసి వెళ్ళేవారు.''

"ఊ .... అసలు సంగతి తొందరగా చెప్పరా. ఇదంతా మామూలేగా. ఈ రోజున యాభై ఏళ్ళావిడ వంటరిగా వెడుతూంటే, పదిహేనేళ్ళ కుర్రాడు వెంటపడి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతాడు. అది మన సినిమాల ప్రభావమో, స్వాతంత్ర్యం యొక్క లక్షణమో అర్థంకాదుగానీ, ఎంత చదువుకున్నదైనా, ఎంత తెలివైనదైనా, ఆడది ధైర్యంగా ఏ భయమూ లేకుండా తిరగలేక పోతోంది. ఊ... చెప్పు అసలేం జరిగిందో ..." సహ భరించలేనట్టుగా మొహం పెట్టాడు ప్రకాష్.

పార్థు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. జేబురుమాలుతో కళ్ళు తుడుచుకున్నాడు.

"పారిజాతం ఇంటికొచ్చి ఆ వెధవలు వెంటపడి కూసిన కూతలు, తనూ తన ఫ్రెండ్సూ ఇచ్చిన సమాధానాలూ, అమ్మకీ, నాకూ చెప్పి పగలబడి నవ్వేది. అమ్మ భయపడిపోయి, పారుని కాలేజీకి పంపించొద్దని చెప్పేది నాతో.

అమ్మ మాటలకి నేనూ, పారు నవ్వుకునేవాళ్ళంరా.

"ఒరేయ్ ప్రకాష్! నిజంగా పారుని కాలేజీకి పంపించకుండా వుంటే బాగుండేదిరా...." మాట్లాడలేక గొంతు పూడుకుపోయి దుఃఖంతో, నోటికి జేబురుమా లడ్డు పెట్టుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు పార్థు.

"ఒరేయ్ పార్థూ! ఊర్కోరా! నీ బాధ చూళ్ళేకపోతున్నాను పార్థూ వాళ్ళలో ఎవరినైనా ప్రేమించి పెళ్ళి చేసుకుంటాననందా? ఎందుకంటే, ఈ రోజుల్లో మనవాళ్ళకి సినిమాలే కొలబద్దలైపోయాయి. ఇలాగే రోడ్డు మీద ఏడిపించడం, గేలి చేయడంతో మొదలయి, ఆ తరువాత వాళ్ళు అమాంతంగా ప్రేమించుకోవడం జరుగుతుంది పాపం! మన పిల్లలు అవన్నీ నిజాలని, జీవితంలో కూడా అలా జరుగుతుందని ఆశపడి, కష్టాలపాలవుతారు." పార్థుని మాట్లాడించాలనీ, ఊరడించాలనీ ప్రకాష్ చాలా తమాషాగా సినిమాల గురించి మాట్లాడుతూ వచ్చాడు.

అయినా పార్థు ధోరణి మారకపోవడం చూసి, "ఒరేయ్! త్వరగా చెప్పరా యేం జరిగిందో! ఇంక నేను భరించలేకపోతున్నాను" అన్నాడు.

"చెప్తారా! నీతో చెప్పుకుంటేనేగాని నా ఆవేదన చల్లారదు. విను ఒక రోజు పారు తన ఫ్రెండింటికి వెళ్ళి వస్తోంది. కొంచెం పొద్దుపోయి కనుచీకటి పడుతోంది. ఆ రోడ్డు మీద పెద్ద జనసమర్దం లేదు. ఆ సమయంలో ఎవడో, రోజూ వెంటపడి తిరిగే బాడీగార్డు వెధవై వుంటాడు. వెనుకనుంచొచ్చి పులిలా పట్టేసి, నోరునొక్కి పక్కకి లాక్కుపోయాట్ట! ఆ మైదానంలో ఎగుడుదిగుడుగా తవ్వి వదిలిపెట్టిన, ఎత్తుపల్లాల మధ్య పడేసి.... రేప్ చేశాడురా ..." బావురుమన్నాడు పార్థు ఇంక చెప్పలేక....

ప్రకాష్‌కి గుండె బద్దలయిపోతున్నట్లనిపించింది. తలమీద పెద్ద పిడుగు పడ్డటయింది.

తనేం వింటున్నాడో తన కర్థం కానట్టనిపించి, "వాట్?" అన్నాడు అయోమయంగా.

"అవునురా! వింటుంటే మతిపోతుంది కదూ? చిరిగిన గుడ్డలతో, చింపిరి జుట్టుతో, కన్నీరు చెంపల మీదుగా ప్రవహిస్తుంటే, పారుని కళ్ళారా చూసిన నేను ఎలా బ్రతికున్నానో ఆశ్చర్యంగా వుంది."

"పారిజాతం నయం, ఏ అఘాయిత్యమూ చేసుకోకుండా ఇంటికొచ్చింది." కంటతడి కనిపించకుండా తుడుచుకుంటూ అన్నాడు ప్రకాష్.

"అవును. 'ఇంటి కెందుకొచ్చానో తెలుసా? నాకు అన్యాయం జరిగిందని చెప్పడానికి అన్నయ్యా! పోలీసులకి చెప్పి మరే పిల్లకి ఈ రకమైన

అమాయిత్వం జరగకుండా వుండేందుకే. నేను చచ్చిపోతే ఈ లోకం, నువ్వు, చివరికి అమ్మకూడా నన్ను అపార్థం చేసుకుంటారన్నయ్యా! అందుకే వచ్చాను' అంటూ భోరుభోరున ఏడుస్తున్న పారుని ఎలా ఓదార్చాలో, ఆ నిమిషంలో నేనేం చెయ్యాలో అర్థంకాక విలవిల్లాడిపోయానురా. ఆ సమయంలో నువ్వు ఇండియాలో వుండుంటే, నా బాధని సగం నీతో పంచుకునుండేవాణ్ణి."

"ఐ కెన్ అండర్‌స్టాండ్" అంటూ ప్రకాష్ ఆప్యాయంగా పార్థ చేతిని తట్టాడు ఓదార్పుగా. ఇద్దరి మనసుల్లోనూ మంటలు రేగినట్టు, ఆవేదన పొగలు కక్కుతోంది.

''ఊ.... తరువాత?'' అడిగాడు ప్రకాష్. పార్థ మొహంలో దుఃఖం పోయి బాధ, ఒకరకమైన కోపం చోటు చేసుకున్నాయి.

"పోలీసు రిపోర్టిచ్చాను దాంతో రచ్చకెక్కడమే కాని ఫలితం లేక పోయింది ఇరుగూపొరుగూ దీన్నో అంటరానిదానిలా చూశారు. చెడిపోయిన పిల్ల అని అందరూ ప్రచారం చేశారురా! పోలీసులు వాణ్ని పట్టుకుంటే వాడె వడైనా సరే, చివరికి వాణ్ణే పెళ్ళి చేసుకుంటానందిరా పిచ్చిపిల్ల. ఇరుగుపొరుగు వారి మాటలు వినలేక, వచ్చిన ప్రతి సంబంధం తిరిగిపోతూవుంటే పిచ్చిదై పోయిందిరా పారిజాతం! అప్పటికి గాని జనానికి దీనిపైన కక్ష చల్లార లేదు. అయ్యో పాపం పిచ్చిదైపోయింది అని సానుభూతి చూపిస్తూ, చేసిన ప్రచారం బంధువులనుకున్న వాళ్ళూ చుట్టుపక్కలవాళ్ళూ ఇంతా అంతా కాదురా! పారిజాతం సైకాలజిస్టు చెలువరాజ్ నర్సింగ్‌హోంలో దాదాపు ఒక నెల రోజు లుంది. ఇంటికి తీసుకురాగానే మళ్ళీ అవే మాటలు. మామూలుగావున్న పారు మళ్ళీ పిచ్చిదానిలా అయిపోయేది. అలా ఇంటికి నర్సింగ్‌హోంకి తిరిగేవాళ్ళంరా! ఒక్క నాతోనూ, అమ్మతోనూ, డాక్టరుతోనూ తప్ప ఇంకెవ్వరితోటి సరిగా మాట్లాడేదికాదు పారిజాతం.

మనుష్యులంటే ఆమెకి పట్టుకున్న అసహ్యమే దీనికి కారణం" అన్నాడు డాక్టరు. తనని నిజంగా అభిమానించే వారితో తప్ప మీ ఇద్దరితోటే మాట్లాడు తోంది మామూలుగా అన్నారు." ప్రకాష్ మూగవాడిలా వింటున్నాడు పార్థ చెప్పేదంతా.

అటువంటి సమయంలో దేవుడిలా కనిపించాడు మనోహరన్. మన ఊరు కాదు, మన భాష కాదు. మనోహరన్ మెడికల్ రిప్రెజెంటేటివ్‌గా డాక్టర్ చెలువరాజ్ దగ్గరికొచ్చేవాడు అక్కడ పేషెంటుగావున్న పారిజాతాన్ని చూశాడు.

ఆమె కథంతా తెలుసుకున్న మనోహరన్ పారిజాతంతో ఆప్యాయంగా మాట్లాడడం మొదలెట్టాడు. క్రమేణా పారిజాతం అతనితో మాట్లాడడం మొదలెట్టింది. అతని స్నేహంతో పారిజాతం మామూలు మనిషవడం డాక్టరుకూడా గమనించాడు. మనోహరన్ పారిజాతాన్ని పెళ్ళి చేసుకుంటానని చెప్పినప్పుడు ఒరేయ్, నాకు అతనొక దేవుడిలా కనిపించాడురా!

"నిజమేరా! స్వార్థం నిండిపోయిన ఈ లోకంలో ఇంత త్యాగానికి ఒడిగట్టే మనుషులుండటం ఆశ్చర్యమే."

"అదే అన్నాను మనోహరన్‌తో. కన్నీళ్ళతో కాళ్ళు కడిగినా అతని ఋణం తీర్చుకోలేనని. అయితే అతను కేవలం జాలితో పారిజాతాన్ని పెళ్ళి చేసుకోవడం నాకిష్టం లేదన్నాను. దానికతడు ఏమన్నాడో తెలుసా?" చెప్పమన్నట్టు చూశాడు ప్రకాష్ పార్థూకేసి, నిశ్చేష్టుడై అతడు చెబుతున్నది వింటూ. "పారిజాతంమీద నాకున్నది జాలికాదు, ప్రేమ. ఆమె సంగతి డాక్టరుగారు చెప్పకముందే నర్సింగ్‌హోంలో ఆమెను చూసినప్పుడు ఆమెవైపు ఆకర్షితుడనయ్యాను. ఆమె కథ విన్నాక ఆమెకు మరింత దగ్గరవ్వాలనిపించింది. ఆమెతో మాటాడుతున్నప్పుడు ఆమెలోని మంచితనం నన్ను ముగ్ధుణ్ని చేసింది. పైగా ఏ తప్పు చేయని ఆమెకి లోకం వేసిన శిక్ష నన్ను కరిగించింది. ఎవరో చేసిన దుర్మార్గానికి ఈ అమాయకురాలు ఆహుతైపోవడం అన్యాయ మనిపించింది. అందుకు ఆమెపై ఏర్పడ్డ అభిమానం, ప్రేమా మరింత ధృఢపడింది. నన్ను నమ్మండి, పారిజాతాన్ని నేను మనస్ఫూర్తిగా ప్రేమిస్తున్నాను" అన్నాడు.

"ప్రకాష్! అతని మాటలలోని సిన్సియారిటీ నన్ను ఆశ్చర్యంలో ముంచింది. పారిజాతాన్ని అతడి చేతుల్లో పెట్టడం నా కర్తవ్యం అనిపించింది. సరేనన్నానురా, అదీ సంగతి. ఇప్పుడుచెప్పు. నా తాపత్రయానికీ, ఆందోళనకీ, ఆవేదనకీ అర్థం వుందంటావా?"

ప్రకాష్ మౌనంగా కళ్ళు తుడుచుకున్నాడు.

వచ్చటి మధుపర్కాలతో, చెట్టాపట్టాలేసుకుని మాట్లాడుకుంటూ, నవ్వులలో తేలిపోతున్న పారిజాతం, మనోహరన్‌లు దూరంనుంచి వస్తూ ఒకరికోసం ఒకరు పుట్టిన దేవతల్లా కనిపించారు ప్రకాష్‌కి. మనస్ఫూర్తిగా ఈ పెళ్ళి నూరేళ్ళపంట కావాలని ఆశీర్వదించాడు రెండు చేతులూ పైకెత్తి దీవిస్తూ. *